# ప్రతిజ్ఞ

రచన :
శ్రీ. జి. అంజిబాబు.

ప్రొద్ది సంధ్యా సమయము. ప్రకృతి ప్రశాంతంగా వుంది.

సూర్యభగవానుని అరుణ కిరణాలు సర్వ చరాచర ప్రపంచాన్ని రాగరంజితం జేస్తున్నాయ్. మానవ హృదయాలను పులకింప జేస్తుంది ప్రకృతి. ఈ వాతావరణంలో రాజారావు డాబాపై పచార్లు జేస్తున్నాడు. వాడి క్లాసు మేట్సైన మేమందరము రూములో కూర్చొని కబుర్లతో కాలక్షేపము చేస్తున్నాము. క్రింది భాగములో అద్దెకుంటున్న సుబ్బారావుగా రిద్దరమ్మాయిలు తాము క్రొత్తగా చూసిన సినిమాలోని పాటలను ప్రాక్టీసు చేసుకొంటున్నారు. రావుమాత్రం చెవులు రిక్కించి వింటున్నాడు వారి సంగీతాన్ని. అందులో పెద్దదయిన కుమారి తను చిన్నప్పుడు నేర్చుకొన్న కొద్ది పాటిసంగీతాన్ని కూడా యీ పాటలలో సమన్వయింప జేయాలని ప్రయత్నిస్తుంది. మొత్తముమీద శ్రావ్యంగా నే సుంది వారి సంగీతం. హఠాత్తుగా మధ్యలో ఆగిపోయింది వారి గానం. (కారణం తల్లి పిలుపై వుండవచ్చు!) రావు మాత్రం యీ హఠాత్సంఘటనకు తట్టుకొనలేక అప్రయత్నంగా యీ క్రింది పదజాలాని హెచ్చుస్థాయిలో ప్రయోగించాడు.

“ఆలిండియో రేడియో......కేంద్రం. ఇప్పటికి ఈ కార్యక్రమం సమాప్తం. కొద్ది క్షణాల్లో తిరిగి ప్రారంభం— అక్కడనే వున్న వారి సోదరునికి వినిపించినది కాబోలు మా రావు ప్రయోగించిన మాటలు, ప్రక్కనున్న పాతకర్రతో పైకి వచ్చాడు పట్టరాని ఆవేశంతో. మేమందరము రావు చుట్టు చేరివుండుటచేత తను తెచ్చుకున్న కర్రను సద్వినియోగ పరచలేక అక్కసునంతా తిట్లతో నే వెళ్ళబుచ్చుకొన్నాడు. అనుకోని యీ సంఘటనకు రావు ఉక్కిరి బిక్కిరై మా వైపు దైన్యంగా జూచాడు. ఈ దృశ్యానికి తన వైపు జూచి నవ్వినకుమారి నవ్వువకవైపు కెలుకుతుండగా తన రక్షణకై మమ్మల్నార్థించాడు. మేము రావుని ఓదార్చుటములో సితమతమై, తలక్రిందులై ఎట్టకేలకు రావు పెట్టిన ఒక షరతులో విజయలక్ష్మిని స్వీకరించాము. రావు ప్రారంభించాడు “ఒరేయ్! వినండి! జాగ్రత్తగా వినండి! నేను యీ రోజు చేసిన చిన్న పొరపాటుకు క్షమించవలసింది పోయి ఆగ్రహితుడై వచ్చిన సోదరుని అండచూసుకొని నాపై ప్రయోగించిన కుమారి నవ్వులను మీరు పరిశీలించేయుంటారు. నాకు ఆ నవ్వు తీరని బాధ కలుగజేసింది. నా హృదయంలో అగ్నిజ్వాలని రగుల్పొల్పింది. కనుక నేను ఏ నాటికైన ఆ కుమారిని పెండ్లాడి ఆమె పొగరును అణగింప జేయాలని నిశ్చయించుకొన్నాను. కనుక మీరందరు నాకు సహాయం జేస్తారని ఆశిస్తున్నాను.” మేమందరము మా హర్షధ్వానాలను తెలియజేశాము. ఆ నాటి మా సమావేశము సమాప్తమైంది. మరునాడు కాలేజీ కైనుకు అందరము రెడీ అవుతున్నాము. కాని రావు మాత్రము రానని భీష్మించి కూర్చొన్నాడు. మేమందరము వాడిని ఎంతో వారించాము. కాని ఏమి లాభము లేకపోయింది. దీనికి కారణం నిన్నటి వీరుడు ఎక్కడ తనకోసము కాచి వుంటాడనేదే రావు భయం. తీరని సందేహమైపోయింది యీ సమస్య రాత్రికి. ఈ విధంగా ఒక వారం రోజులు గడచినై. ప్రతి రోజు రావు కాలేజికి రానని భీష్మించి కూర్చోటమున్ను మేము వాడిని వారించటమూ కుమారి గమనించింది కాబోలు “రావుగారూ! మరేమీ ఫర్వా లేదు. మీరు నిర్భయంగా కాలేజీకి వెళ్ళవచ్చు. మా సోదరుడు వూరికి వెళ్ళిపోయినాడు లెండి” అని అంది. అప్పటివరకు ఊపిరి సల్పుకోని రాజారావు ప్రశాంతంగా ఊపిరి సల్పుకొని కాలేజీకి బయలుదేరాడు. ఈ నాడు కుమారి తన నుద్దేశించి పలికిన పలుకులు తన భావి కార్యక్రమానికి నాందీ ప్రస్తావనలని తెల్సుకొని ఆమెతో ఎక్కువ పరిచయము సంపాదించవలెనని తల్చాడు రావు. అట్లు చేసాడు కూడా.

పరీక్షలు దగ్గరకొచ్చినయ్. అందరము ఈ సంగతులన్ని మరచిపోయి మా చదువుల్లో మునిగిపోయినాం. పరీక్షలయినాయి. అందరము బాగానే వ్రాశాము. శలవులు గూడా ఇచ్చారు. మా భావి కార్యక్రమాన్ని గూర్చి చర్చించుకొనుటకై ఒక సభను ఏర్పాటు చేసుకొన్నాము.

మాలోనుండి మూర్తి లేచి (మాలో పెద్ద లెండి) ఇలా ప్రారంభించాడు......

"అధ్యక్షా! సోదరులారా! (అధ్యక్షుడు లేడు. నీ మొగం లేదు. కానీయరా!) ఈ రోజు మనకందరికి శలవు లిచ్చారు. ఇక మనము ఎవరింటికివారు వెళ్ళవలసిన వారము. మరల మనము భవిష్యత్తులో ఎప్పుడు ఎక్కడ కలుసుకొంటామో తెలియదు. ఒకవేళ కలుసుకొన్నా అందరము కలసి రాజారావు కార్యక్రమాన్ని జయప్రద మొనర్చి పోదాం. రాజారావు విషయంలో కుమారుని పెండ్లాడుటకు ఆమె తండ్రిని ముఖాముఖిని తేల్చుకోవటం మంచిది. కనుక అట్లా చేయటానికి వీడికి కొంత శిక్షణవసరము. ఈ శిక్షణ పూర్తయ్యేవరకు మన ఖర్చులు వీడేభరాయించుకొంటాడు" అని కూర్చొన్నాడు. అందరము మూర్తి సలహాకు మెచ్చుకొని వాడిని అభినందించాము. రాజారావు మొదటలో కొంత సందేహించినను తర్వాత ఒప్పుకొన్నాడు. మాలో కవియైన విశ్వనాథం (అంటే నాయనమ్మ అమ్మమ్మ కథ వ్రాస్తుంటాడు లెండి) కావలసిన పోర్షనంతా వ్రాసేవాడు. నేను మూర్తి ఎట్లానటించాలో డైరెక్షనిస్తున్నాము. ప్రతిరోజు 2 గంటలు రావుతో ప్రాక్టీసు చేయిస్తున్నాము.

* * *

అయ్యా! అయ్యా! సుబ్బారావుగారూ! నేనండీ పైనుండే స్టూడెంటును లెండి. పేరు రాజారావండీ. B. A. ఫైనల్ య్యియరు పరీక్షలు వ్రాశానండీ. ఎందుకొచ్చానంటారా! నేను...... నేను మీ అమ్మాయిని ప్రేమించానండీ. ఆ! ఆ! ప్రేమించలేదంటారా! ఋజువు కావాలంటే మా మిత్రుల నడగండీ ఆస్థి ఏమాత్రం వుందంటారా! ఏదో ఫర్వాలేదులెండి: నామటుకు కట్నం వద్దు లెండి. ఏదో నా పొరపాట్లను క్షమించి నాకు మీ అమ్మాయి నిచ్చి వివాహం జేయాలని రిక్వెష్టు చేస్తూ ప్రార్థిస్తున్నానండి" ఈ విధముగా ప్రతిరోజు చక్కని డైరెక్షన్లతో రాత్రికి శిక్షణ గరుపుతున్నాము.

ఒక రోజున బజారు నే పోతున్న డ్రామాల కంట్రాక్టరు మా గొడవవిని డ్రామాల రిహార్సులనుకొని నా వద్దకు పరుగెత్తుకుంటూవచ్చి కొద్ది రోజులలో తను డ్రామా కంపెనీ తెరవపోతున్నాననియు మమ్మల్ని దాంట్లో యాక్టుజెయ్యమని కోరాడు, మాలో ప్రసాదు లేచి (అంటే వాడు మహాకరుకు లెండి) "బరి! నీయమ్మ కడుపుకాలా! ఇక్కడ తద్దినమైనావా ఇవి డ్రామా రిహార్సులుగావు నీ పిండాకూడూ కావు పొమ్మ అని బైటికి నెట్టాడు." ఇటువంటి సంఘటనలతో మా శిక్షణ కొద్ది రోజులలో పూర్తయ్యింది. ఇక మా రావు పరిపూర్ణ శిక్షితుడైనాడని తలచి మేమందరము ప్రయాణ సన్నాహులమైనాము. మా కందరకూ రావు కృతజ్ఞతతో వీడ్కోలిచ్చాడు. ఎవరిళ్ళకు వాళ్లు వెళ్ళిపోయినాము.

* * *

కాలగర్భంలో నాల్గునెలలు గడచిపోయినై. ఒక శుభ ముహూర్తాన మా కందరకు శుభలేఖలు వచ్చినై. మా కందరకు ఆశ్చర్యమేసింది. రావు తన కథనంతా పెళ్ళిలో చెప్పేశాడు "అరేయ్! మీ శిక్షణ బాగానే పారిందిరా! నేను ఒక రోజు సుబ్బారావు గారింటికి వెళ్ళి మీ రిచ్చిన పోర్షను వల్లించాల్సిన రీతిలో వల్లించాను. మొదట సుబ్బారావుగారు వప్పుకోకపోయినా మా యింటి అడ్రసు కనుక్కొని మా తండ్రికి వుత్తరము వ్రాశాడు. మా తండ్రి ఎట్టకేలకు సుబ్బారావుగారితో వియ్యమొందటానికి వప్పుకొన్నాడు", అని చెప్పాడు. ఇది రాత్రి జరిగిన సంగతి.

ఒరేయ్! "మీ భార్యామణి పొగరణచటం మాట మర్చిపోయేవ్" అన్నాము అందరము ఏకకంఠంతో!...

